క్లుప్తంగా

జిల్లా కోర్టు రోడ్డులో రాకపోకలు బంద్



మచిలీపట్నంటౌన్:స్థానిక జిల్లా కోర్టురోడ్డులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ఉండటంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అటువైపు వెళ్ళకుండా ఉండేందుకు పోలీసులు ఏకంగా ఆ మార్గంలో రాకపోకలనే నిలుదల చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం పిలుపునివ్వటంతో జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశాలతో పోలీసు యంత్రాంగం జిల్లా కోర్టు రోడ్డును బారికేడ్లతో పూర్తిగా మూసేసి రాకపోకలను నియంత్రించారు. దీంతో జిల్లా కోర్టుకు రాకపోకలు సాగించే ప్రజలతో పాటు న్యాయమూర్తులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ మార్గంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా నియంత్రించేందుకు పోలీసులు చేసిన ఈ చర్యను వైఎస్సార్ సీపీ శ్రేణులు, నగరవాసులు తప్పుబట్టారు.

నేతన్నలకు వెన్నుపోటు పొడిచిన కూటమి

పెడన:నేతన్నలకు సైతం వెన్నుపోటు పొడిచారని మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. వెన్నుపోటు దినోత్సవం నిరసన కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలకు ఏడాదికి రూ.24వేలు వేశారని, ఐదేళ్లపాటు రూ.1.20 లక్షలు అందించారన్నారు. నేడు చంద్రబాబు సర్కారు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయకపోగా 200 యూనిట్ల వరకు ఉచితమని ప్రకటించారే తప్ప విధివిధానాలు విడుదల చేయకపోవడం వెన్నుపోటేనని దుయ్యబట్టారు.కౌన్సిలర్లు సతీష్‌బాబు, మెట్ల గోపీ, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

కడుపు నిండా తిండి పెట్టండి

నాగాయలంక: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించి కడుపు నిండా తిండి పెట్టించాలని ఏపీ పౌరహక్కుల సంఘం కృష్ణా జిల్లా కార్యవర్గ సభ్యుడు జక్కా కేశవరావు డిమాండ్ చేశారు. నాగాయలంక వచ్చిన ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఏడాది కాలంగా అన్ని వర్గాల ప్రజలను దారుణంగా కూటమి ముంచేసిందన్నారు. దివిసీమ ప్రాంతంలోని ఘంటశాల చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు మొండి చెయ్యి చూపిందన్నారు.సూపర్ సిక్స్ మేనిఫెస్టోను తక్షణం అమలు చేయాలని లేదంటే ప్రజల నుంచి తీవ్ర తిరుగుబాటు తప్పదన్నారు.

పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లండి

చల్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి-2 పి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మొత్తం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 2332 మంది విద్యార్థులకు పుస్తకాలు వచ్చాయని చెప్పారు. కొత్తగా జరిగే అడ్మిషన్లకు చెందిన విద్యార్థులకు మరలా ఇండెంట్ పెట్టి తెప్పిస్తామని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు ఎంఈవో కార్యాలయంలో ఉన్న పాఠ్యపుస్తకాలను తీసుకెళ్లాలని సూచించారు.

జ్యోతిర్లింగాలకు అభిషేకాలు

చల్లపల్లి: మండల పరిధిలోని శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయంలో రాజగోపుర మూడో వార్షిక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సాయిబాబ శర్మ (గణపతి దీక్షితులు) ఆధ్వర్యంలో తొలుగ గణపతి పూజ, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తి పీఠ దేవతా మూర్తులకు, సకల పరిహార దేవతలకు ప్రదోషకాల అభిషేకాలు చేశారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పద్మశ్రీ దివ్యసహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మచే పృధ్వీశ్వరస్వామివారి విశిష్టతపై ఉపన్యశిస్తారని తెలిపారు. రాజగోపుర గోపుర నిర్మాణ దాతలు మండవ రవీంద్ర, రమణకుమారి దంపతులు, ముల్లుపెద్ది త్రివిక్రమరావు పర్యవేక్షించారు.

మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టండి

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ద ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఉత్తరచిరువోలులంక నుంచి అయోధ్య పోయే కృష్ణా కరకట్ట మురుగు డ్రెయిన్‌లో మట్టి అక్రమ తవ్వకాలను గ్రామస్తుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ కొంతమంది రైతులు తమ పొలంలో మెరక తీసుకునే పేరుతో అనుమతులు పొంది మురుగుకాలువలో మట్టి తవ్వేస్తూ భారీగా గోతులు పెడుతున్నారని తెలిపారు. ఇలాగే కొనసాగితే మురుగు వెళ్లే మార్గం లేక గట్లు కోతకు గురై పంటకు ముంపు సమస్య ఎదురవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా మట్టి తవ్వేవారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక వీఆర్వోకు ఎమ్మెల్యే సూచించారు.

పెడనలో ర్యాలీగా వెళ్తున్న ఉప్పాల రాము, హారిక, పార్టీ శ్రేణులు



మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న పేర్నికిట్టు



అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలో సింహాద్రి, పార్టీ నాయకులు



వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

పెడన:వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నారా చంద్రబాబునాయుడు నిలిచారని, ఆవిషయం రాష్ట్ర ప్రజలందరికీ తెల్సిందేనని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి 'వెన్నుపోటు దినోత్సవం' నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉప్పాల రాము నేతృత్వంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ పరిపాలన విధానాలను వ్యతిరేకిస్తూ ఈ' వెన్నుపోటు దినోత్సవం' వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రాము తెలిపారు. తహసీల్దారు కె. అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలమవుతున్నా ప్రజాసంక్షేమాన్ని గాలికివదిలేసి కక్ష సాధింపు చర్యలకు మాత్రం వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నారంటూ దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు సీఎం చంద్రబాబు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి ఆదాయాన్ని సృష్టిస్తామంటూ గద్దెనెక్కి అప్పులు చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ పేద ప్రజలకు, విద్యార్థులకు, రైతులకు ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అందరం ఒక సైన్యంగా ఏర్పడి సమష్టిగా రాజకీయ పార్టీలకు అతీతంగా ముందుకు వెళ్తున్న మన జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి ప్రజా పోరాటం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూరగడ్డ శ్రీనాథ్, కొండవీటి నాగబాబు, ముత్యాల నాగేశ్వరరావు, జల్లా భూపతిరావు, సమ్మెట శ్రీనివాసరావు, ఎంపీపీలు సంగా మధుసూధనరావు, వెలివెల చినబాబు, కూనసాని గరుడప్రసాద్, జడ్పీటీసీలు వేముల సురేష్‌రంగబాబు, మైలా రత్నకుమారి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, భండారు ఆనందప్రసాద్, గరికపాటి రామానాయుడు, అచ్యుతరావు, తిరుమాని శ్రీనివాసరావు, వైధాని వెంకట్రాజు, కొల్లాటి గంగాధర్, యాదంరెడ్డి వరప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పెడనలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు భారీగా చేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు

సంక్షేమం దూరమైంది



కూటమి పాలనలో పేదలకు వచ్చే సంక్షేమం దూరమైంది. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాలాంటి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, పలు రంగాల వారికి ఆర్థిక సహాయం అందించారు. ప్రతి కుటుంబానికి సరా సరిన ఏడాదికి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల మేర ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పించింది. కానీ కూటమి పాలనలో గత ప్రభుత్వ పథకాలన్నింటినీ రద్దు చేశారు. దీంతో తమ చేతిలో చిల్లిగవ్వ ఉండక, ఉపాధిలేక ఇబ్బంది పడుతున్నాం. కూటమి పాలకులు ఇచ్చిన హామిలు అమలు చేయాలి.

–కొమ్మకూరి ప్రదీప్, రాజుపేట

అధికారం కోసం బూటకపు హామీలు



అధికారంలోకి రావడానికి కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. సూపర్ సిక్స్ అంటూ బూటకపు హామీలు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి అంటూ ప్రజలను మభ్యపెట్టారు. ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. ప్రజలను మభ్యపెడుతూ పరిపాలన సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం.

–పుప్పాల సాంబశివరావు, నీలిపూడి, కృత్తివెన్ను మండలం

కూటమి పాలనపై కన్నెర్ర...

మచిలీపట్నంటౌన్/రూరల్:మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై కన్నెర్ర చేశారు. పాలన చేపట్టి ఏడాదైనా తమ కష్టాలను తీర్చటంలో కూటమి పాలకులు ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. కూటమి పాలన ఏడాది పూర్తయినా సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో బుధవారం నగరంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో గ్రామాల నుంచి ఆ పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు వేలాదిగా స్వచ్ఛందంగా హాజరై కూటమి పాలనపై దుయ్యబట్టారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని గాడెల్లి వారి కళ్యాణ మండపం నుంచి లక్ష్మీటాకీస్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాయలం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. మార్గమద్యలో ఉన్న భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పేర్నికిట్టు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి పేర్ని కిట్టు మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర నగరంలోని డ్రెయిన్‌లను అభివృద్ధి చేస్తామనే బూచిని చూపి చిరువ్యాపారుల బడ్డీలను దారుణంగా తొలగించారని చెప్పారు. వ్యాపారులంతా ఉపాధి కోల్పోయి ఏడుస్తుంటే బీచ్ ఫెస్ట్ సంబరాల పేరుతో సినిమా నటులను తీసుకొచ్చి రోడ్లపై డ్యాన్సులు చేయిస్తున్నాడని దుయ్యబట్టారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, జిల్లా కార్యదర్శులు గణేశన రమేష్‌బాబు, జువ్వా నాగరాజు రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు(జానీ), వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న, నగర ఉపాధ్యక్షులు గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్ లాల్ నెహ్రూ, షేక్ మహమ్మద్ సాహెబ్, కొలుసు హరిబాబు, పార్టీ దక్షిణ, ఉత్తర మండల అధ్యక్షులు జన్ను రాఘవరావు, మట్టా నాంచారయ్య, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, పలు డివిజన్‌ల కార్పొరేటర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వెన్నుపోటు దినంకు కదం తొక్కిన వైఎస్సార్ సీపీ

అవనిగడ్డ:వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు కదం తొక్కారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వంతెన సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు భారీ ర్యాలీ చేశారు. స్థానిక ఆర్టీసీ సెంటర్‌లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని కూటమి పాలకులు ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎంతో కష్టపడి నియోజకవర్గంలో 22ఎ నిషేధిత భూముల క్రింద ఉన్న వేలాది ఎకరాలకు విముక్తి కలిగిస్తే కూటమి అధికారంలోకి రాగానే చంద్రబాబు మళ్లీ ఈ భూములకు చుక్క పెట్టి రైతులకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మా పాలనలో మంజూరు చేసిన ఎదురుమొండి వారధిని కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా వేలాది మంది దీవుల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అనంతరం తహశీల్దార్ నాగమల్లేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి దోవారి విద్యాసాగర్, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్ను రంగారావు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒడుగు నరేంద్ర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల జయగోపాల్, పంచాయితీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల, కోడూరు జెడ్పీటీసీలు చింతలపూడి లక్ష్మీనారాయణ, రాజులపాటి కళ్యాణి, తుమ్మల మురళి, యాదవరెడ్డి సత్యనారాయణ, అవనిగడ్డ, ఘంటసాల, చల్లపల్లి, కోడూరు మండల కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, వేమూరి వెంకట్రావ్, శీరం నాని, పరిశె మాధవరావు, బూత్ కమిటి జిల్లా అధ్యక్షుడు మద్ది వెంకట నారాయణ(చిన్నా), ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి లింగం జగదీష్ కుమార్, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లూరి శ్యామ్యూల్, రైతు విభాగం నియోజకవర్గ కన్వీనర్ బీసీబత్తిన ప్రసాద్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, ఎస్సీసెల్ నియోజకవర్గ కన్వీనర్ వెన్నా ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు కోలా హరికృష్ణ, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు యాసం శివ, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కర్రా రవికుమార్, వైస్ ఎంపీపీ మోడెం నాగరాజుతో పాటు ఆరు మండలాల నుంచి పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాల్సిందే



గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. అలాంటి బాధ్యతను నెరవేర్చకుండా ప్రజలను దగా చేస్తూ చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అన్నారు. ఏడాది పూర్తయినా ఏ ఒక్కరికీ మూడు సిలిండర్లు వచ్చిన దాఖలాలు లేవు. ఏడాది కాలంగా ఫీజు రీయిం ఎంబర్స్‌మెంట్ ఇవ్వలేదు. ఫీజులు కట్టలేక విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా నిలిపివేసే పరిస్థితిలో ఉన్నారు.

–దావు శ్రీనివాసరావు, కొంకేపూడి, పెడన మండలం

రైతులను నట్టేట ముంచారు



కూటమి పాలనలో రైతులకు ఇబ్బందులు తప్పటం లేదు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వటం లేదు. దీంతో పండించిన పంటకు కనీసం ఖర్చులు కూడా రాకపోవటంతో నష్టాల పాలవుతున్నాం. ఎరువులు సరిపడా సరఫరా చేయలేకపోతున్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభించే తొలకరి అదును వచ్చినా విత్తనాలు సరఫరా చేయటం లేదు. గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారు. దీంతో రైతులకు గత ప్రభుత్వంలో అమలైన సేవలు దూరమయ్యాయి.

–ధూళిపాళ నరేంద్రబాబు, రైతు, గుండుపాలెం

ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే



ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ఘనత జగనన్నకే దక్కింది. 2019లో మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాలు పథకాలను ఏ ఒక్క దానిని కూడా వదలకుండా అమలు చేశారు. జగనన్న పాలన సాగించిన ఐదేళ్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు నిర్విరామంగా సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఈ పథకం అమలు చేశామని ఏ ఒక్క తెలుగుదేశం, జనసేన కార్యకర్త కూడా గట్టిగా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. ఏడాది పాలనలో ప్రజలు ఎంత విసిగిపోయారో అర్థం అవుతుంది.

–కంచర్లపల్లి నాగేంద్రరావు, కంకటావ, గూడూరు మండలం

ఉపాధి కోల్పోయాం



గత ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన ఎండీయూ వాహనాల ద్వారా నాలుగేళ్లుగా ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తున్నాం. కూటమి పాలకులు తమను కొనసాగిస్తామని చెప్పి హామి ఇచ్చి ఈ నెల నుంచి వాహనాల ద్వారా సరుకుల పంపిణీని నిలుపుచేశారు. దీంతో వాహనాలను నిర్వహించే తామంతా ఉపాధిని కోల్పోవాల్సి వచ్చింది. డీలర్ల ద్వారా రేషన్ తెచ్చుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారు కూడా వాహనాల ద్వారా ఇంటి వద్దే సరుకులు ఇవ్వాలని కోరుతున్నందున ప్రభుత్వం మరో సారి పునఃపరిశీలించాలి.

–వెంటాల బుచ్చిబాబు, ఎండీయూ వాహన నిర్వాహకుడు, శివగంగ

ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు



ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్న ఆలోచన చంద్రబాబు నాయుడుకు లేదు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా, రైతు రుణమాఫీ అంటూ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక తుంగలోకి తొక్కారు. ఇప్పుడు కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నట్టేట ముంచడం చంద్రబాబు నైజం. అదే నైజం కొనసాగిస్తున్నారు తప్పించి ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయాలన్న ఉద్దేశం ఆయనకు కనిపించడం లేదు.

–కె.సుబ్బారావు, బంటుమిల్లి



వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న రాము, హారిక



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పేర్నికిట్టు, నాయకులు



అవనిగడ్డలో ర్యాలీగా వెళుతున్న సింహాద్రి తదితరులు



అవనిగడ్డలో కదం తొక్కిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

వెంకన్న బ్రహ్మోత్సవాలకు వేళాయే



శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరుడు



ముస్తాబైన కల్యాణ వెంకటేశ్వరుడి ఆలయం

కోడూరు:దివిసీమలో ప్రసిద్ధిగాంచిన కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ప్రారంభించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 6న ఉదయం 10 గంటలకు స్వామివార్లకు అష్టోతర శతకలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ బుధవారం చెప్పారు. రాత్రి 7 గంటలకు ప్రముఖ ఉపన్యాస వాచస్పతి మొవ్వ ఉషాద్రిపతి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టి, రాత్రికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణము, సంతానమ కోరే మహిళలకు గరుడ ప్రసాదమును అందించనున్నట్లు తెలిపారు. 7న ఉదయం హోమాలు, శతకలశ క్షీరాభిషేకం, రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎదురుకోలోత్సవం, 8న ఉదయం కౌతుకోత్సవము, నవకలశ స్నపన, రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 9న గరుడ, శేషవాహనాలపై స్వామివారి తిరువీధి ఉత్సవం, 10న అవభృదస్నానం, మహాపూర్ణాహుతి,. ధ్వజాఅవరోహణ, 11న శాంతి కల్యాణం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలను ముగించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 12న శ్రీవారి మహా అన్న సమారాధనను నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

8న గంగానమ్మ తల్లి వాయు విగ్రహ ప్రతిష్ట

టి.కొత్తపాలెం(నాగాయలంక):గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో ఈ నెల 8వతేదీన శ్రీగంగానమ్మ తల్లి వాయు ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నామని స్థానిక భ్రమరాంబ ఆలయ ధర్మకర్త బండ్రెడ్డి నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆరంభమవుతాయని పేర్కొన్నారు. 6న యాగశాల ప్రవేశం, అఖండ స్థాపన, అంకురారోహణ, హోమాలు జరుగుతాయని చెప్పారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

భావదేవరపల్లి(నాగాయలంక): సీనియర్స్ సిటిజన్ ఫోరం, సమరసత సేవా ఫౌండేషన్, బాలాజీ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధులు రామాంజనేయులు, నిరంజనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని షాన్ హాస్పిటల్స్ సహకారంతో డాక్టర్ వికాస్ కాట్రగడ్డ నేతృత్వంలో ఎముకలు, కీళ్ళు, మెదడు, వెన్నుముక, మెడ నరాల సంబంధిత వ్యాధులకు వైద్యపరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తామని వెల్లడించారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి

ఘంటసాల: బౌద్ధ స్థూపం వద్ద నిర్వహించే జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఘంటసాల గ్రామంలోని బౌద్ధ స్థూపం వద్ద ఈ నెల 13న ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించి బౌద్ధ స్థూపం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించామన్నారు. బౌద్ధ బిక్షవు భంతే ధమ్మ ధజ థెరో మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రత్యేకమైన యోగా తరగతులు నిర్వహిస్తామన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ఆర్‌ఐ కె.శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చందు, ఉపాధిహామీ పథకం టీఏ అలివేలు మంగమ్మ, సీఓ బాలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాసవీ మాత విగ్రహ ప్రతిష్ట

చల్లపల్లి:మండల పరిధిలోని పురిటిగడ్డలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గుడివాడకు చెందిన చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచన, వాస్తు పర్యగ్నీకరణ పూజలు చేశారు. సాయంత్రం నుంచి పరిషత్ దక్షిణ, రుత్విక్ వరుణ, రక్షా బంధన, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, ద్వార తోర పూజ, చతుస్థానార్చన హోమాలు నిర్వహించారు.

పచ్చి రొట్ట విత్తనాలు రాక

పెడన:మండలంలో ఇన్‌చార్జి ఏవో పెడన వైపు కన్నెత్తడం లేదని, రైతు సేవా కేంద్రాల్లో ఉన్న కొందరు వీఏఏలు, ఎంపీఈవోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంపై 4న 'వ్యవసాయశాఖలో ఇష్టారాజ్యం' అంటూ సాక్షిలో కథనం ప్రచురితమైంది. బుధవారం ఉదయం ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా కార్యాలయానికి చేరుకుని మండలంలోని వీఏఏలు, ఎంపీఈవోలతో మాట్లాడి వారి పరిధిలో వివిధ అంశాలపై సమీక్షించారు. పచ్చిరొట్ట విత్తనాలకు వంద క్వింటాళ్లకు కేవలం వంద కేజీలు మాత్రమే వచ్చాయని తెలిపారు.